క్లుప్తంగా

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు



వలంటీర్ అభ్యర్థిని ఇంటర్వ్యూ చేస్తున్న అధికారులు

మునగపాక: మండలంలోని ఖాళీగా ఉన్న 11 వలంటీర్ పోస్టులకు శుక్రవారం ఇంటర్వ్యూలు జరిగాయి. మండల పరిషత్ హాల్లో ఎంపీడీవో మన్మధరావు, తహసీల్దార్ ప్రకాశరావులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 11 వలంటీర్ పోస్టులకు 27 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్లుగా ఎంపికైన వారు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా పనిచేయాలన్నారు. ఎంపికైన వారికి ఈ నెల 31న నియామక ఉత్తర్వులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ ఈశ్వరరావు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తం



సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ అప్పలరాజు

పాయకరావుపేట : ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు పెరిగి, ప్రజలు చాలా త్వరగా మోసపోతున్నారని పాయకరావుపేట సీఐ అప్పలరాజు అన్నారు. శ్రీ ప్రకాష్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రలోభాలకు గురిచేసే ఫోన్ కాల్స్, లోన్ యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. సైబర్ నేరాలు జరిగే తీరును వివరించి, వాటి బారిన పడి మోసపోకుండా ఎలా వ్యవహరించాలో వివరించారు. సదస్సులో ఎస్‌ఐ ఎస్.రమేష్, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వీర్రాజు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గిరిజనుల దీక్ష

కోటవురట్ల: అణుకు గిరిజనుల రిలే నిరాహార దీక్ష శుక్రవారం నాటికి 22వ రోజుకు చేరింది. రిలే నిరాహార దీక్షల్లో భాగంగా మోకాళ్లపై నిలుచుని నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ 22 రోజులుగా అమాయక గిరిజనులు దీక్ష చేస్తున్నా అధికారులు స్పందించకపోవడం అన్యాయం అన్నారు. ఆ గ్రామానికి రహదారి లేకపోవడంతో నేటికీ వైద్యసేవలకు డోలీ కట్టాల్సిన పరిస్థితి ఉందన్నారు. చిన్నారులు విద్య కోసం రానుపోను 12 కిలోమీటర్లు నడుస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు గిరిజనుల మొర ఆలకించాలని కోరారు. సీపీఎం నేత జి.డేవిడ్‌రాజ్, గిరిజనులు పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి



ముఠా కార్మికులతో కలిసి నినాదాలు చేస్తున్న రాజాన సత్తిబాబు

అచ్యుతాపురం(అనకాపల్లి): ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 2న విజయవాడలో నిర్వహించే ముఠా కార్మికుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని సంఘం కన్వీనర్ రాజాన సత్తిబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం ముఠా కార్మికులు పనిచేసే ప్రదేశాలకు వెళ్లి వారితో మాట్లాడారు. ముఠా కార్మికులకు పీఎఫ్, ఈఎస్‌ఐ, సంక్షేమ బోర్డు ఏర్పాటు సాధన కోసం ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము, సంఘ నాయకులు తాతారావు, రాజు, వెంకన్న, రాము పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

ఎస్.రాయవరం: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి శక్తి ప్రియ సూచించారు. పీహెచ్‌సీ పరిధిలో శుక్రవారం సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వర్షాకాలంలో బాగా మరిగించి, చల్లార్చిన నీటిని త్రాగాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమం.. ఊరూరా అభివృద్ధి

- జగనన్న సురక్షలో 20,241 ధ్రువపత్రాల పంపిణీ
- 83 సచివాలయాలకు రూ.16.60 కోట్ల జీజీఎంపీ నిధులు



టి.సిరసపల్లిలో అర్హురాలికి ధ్రువపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు



నాగవరంలో గడప గడపకు నిధులతో నిర్మించిన రోడ్డు

మునగపాక: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కూడా అంతే స్థాయిలో జరుగుతోంది. సీఎం జగన్ పాలనలో రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందుతుండటంపై ప్రజలు పూర్తి స్థాయిలో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం(జీజీపీఎం) ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కొత్తగా చేపట్టిన జగనన్న సురక్ష ద్వారా 11 రకాల సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. శుక్రవారంతో నియోజకవర్గంలో జగనన్న సురక్ష దిగ్విజయంగా పూర్తయింది.

83 సచివాలయాకు రూ.16.6 కోట్లు

నియోజకవర్గంలోని 83 సచివాలయాల పరిధిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా గుర్తించిన సమస్యల పరిష్కారానికి రూ.16.6 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ప్రతీ సచివాలయానికి రూ.20 లక్షల వంతున నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో గ్రామాల్లో రహదారులు, సీసీ డ్రైన్లు, రక్షిత మంచినీటి పథకాలను నిర్మించారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ఎమ్మెల్యే రమణమూర్తిరాజు తాను తెలుసుకున్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే పలు చోట్ల అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి.

జగనన్న సురక్షతో 20,241 మందికి లబ్ధి

గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా తెలుసుకున్న సమస్యలతో పాటు 11 రకాల సేవలను ప్రజలకు అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని ఆలోచన. మండల వ్యాప్తంగా 19,026 కుటుంబాలు ఉండగా, జగనన్న సురక్ష ద్వారా 20,241 మందికి 11 రకాల ధ్రువపత్రాలను అందించారు. ఇందులో 11,341 కుల, 7,098 ఆదాయ, 58 జనన, 21 మరణ ధ్రువపత్రాలు, 2 వివాహ రిజిస్ట్రేషన్, 96 ఫ్యామిలీ, 27 మ్యుటేషన్, 711 ఆధార్ లింక్, 44 సీసీఆర్‌సీ కార్డులు, 224 రైస్ కార్డులు, 63 హౌస్‌హోల్డ్స్ స్ప్లిట్ సర్టిఫికెట్లున్నాయి. దరఖాస్తు చేసుకున్న వారం రోజుల్లో ఈ ధ్రువపత్రాలు అందించడం పట్ల ప్రజలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తిప్పలు తప్పాయి



గతంలో ప్రభుత్వ సేవలు పొందాలంటే కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. నేడు వలంటీర్ల చొరవతో మాకు అవసరమైన సేవలన్నీ స్థానికంగానే అందుతున్నాయి. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఎలాంటి నోటరీలు అవసరం లేకుండానే ఆదాయ ధ్రువపత్రం వచ్చింది. చాలా సంతోషంగా ఉంది.

– కొయిలాడ ఆదిలక్ష్మి, లబ్ధిదారు, వాడ్రాపల్లి

సత్వర సేవలు



జగనన్న సురక్ష ద్వారా వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన వారు కోరిన సర్టిఫికెట్లను అందించాం. ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు సకాలంలో స్పందించాం. సచివాలయాల వద్ద ప్రజలకు మెరుగైన సేవలందించగలిగాం. ఈ కార్యక్రమం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడింది.

– మన్మధరావు, ఎంపీడీవో, మునగపాక

అభివృద్ధి, సంక్షేమం



జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో జరుగుతోంది. గతంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నాం. ఇపుడు జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువపత్రాలను స్థానికంగానే అందించాం.

– యూవీ రమణమూర్తిరాజు, శాసనసభ్యులు, యలమంచిలి

జగనన్న సురక్షతో అందరికీ మేలు



ధ్రువపత్రాలు అందిస్తున్న అధికారులు, నాయకులు

పాయకరావుపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం అందరికీ ఎంతో మేలు చేస్తుందని రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వెంకటనగరం గ్రామంలో శుక్రవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి హాజరై, మాట్లాడారు. ప్రజలు సంక్షేమ పథకాలు, వాటికి అవసరమైన ధ్రువపత్రాల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా, అధికారులే గ్రామానికి వచ్చి మరీ అందించడం ఆనందంగా ఉందన్నారు. తీర ప్రాంత మత్యకార గ్రామాలకు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వానికి విన్నవించినట్టు తెలిపారు. సర్పంచ్ వంకా వెంకటరమణ మాట్లాడుతూ గ్రామంలో ఇళ్ల స్థలాలు, పింఛన్లు మంజూరు కాని వారి వివరాలను వెల్లడించారు. భూములు రీ సర్వే సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని మండల ప్రత్యేక అధికారి సీహెచ్ లచ్చన్న తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 286 ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.సాంబశివరావు, వివిధ విభాగాల అధికారులు పరదేశి, కచేరి, మనోజ్ కల్యాణ్, డీటీ కె.నూకరాజు, ఈవోఆర్‌డీ వైవీ సత్యనారాయణ, కార్యదర్శి బీపీబీఎల్ మూర్తి, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్‌ను సత్కరిస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘ సభ్యులు

మునగపాక: నాయీ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ హామీ ఇచ్చారు. శుక్రవారం మండలంలోని నాయీ బ్రాహ్మణ సంఘ సభ్యులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రసాద్‌కు వినతి పత్రం అందించి, ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్నారన్నారు. నాయీ బ్రాహ్మణులకు పెద్దపీట వేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో సంఘ మండల అధ్యక్షుడు కొడమంచిలి దక్షిణేశ్వరరావు, కార్యదర్శి జొన్నాడ సతీష్, కోశాధికారి కాదులూరి శంకర్, సభ్యులు అప్పారావు, సోమునాయుడు, అచ్యుతరావు, సంజీవ్, ప్రసాద్, శివ, శ్రీను, రమణ, భాను, మాజీ వైస్ ఎంపీపీ దొడ్డి వరహా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా జగనన్న సురక్ష

యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు



జగనన్న సురక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

అచ్యుతాపురం(అనకాపల్లి): జగనన్న సురక్ష కార్యక్రమం యలమంచిలి నియోజకవర్గంలో విజయవంతంగా పూర్తయిందని ఎమ్మెల్య కన్నబాబురాజు తెలిపారు. అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం, తిమ్మరాజుపేట సచివాలయాల పరిధిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో అన్ని వర్గాల వారికి, వారు దరఖాస్తు చేసుకున్న ధ్రువపత్రాలను వారి గ్రామాల్లోనే అందించామన్నారు. ఎలాంటి రుసుము వసూలు చేయకుండా సర్టిఫికెట్లు అందుకున్న ప్రజలు తమ ఆనందాన్ని, ప్రభుత్వం పట్ల కృతజ్ఞతను తెలిపారని వెల్లడించారు. నిత్యం ప్రజల సంక్షేమం కోసం తపన పడే సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మళ్లీ గెలిపించాల్సిందిగా అభ్యర్ధించారు. కార్యక్రమంలో ఎం.సూర్యనారాయణ, ఎంపీపీ భర్త కోన బుజ్జి, జెడ్పీటీసీ లాలం రాంబాబు, కో ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్, దేశంశెట్టి శంకరరావు, పిన్నమరాజు వాసు, జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన



ప్రకృతి వ్యవసాయం కోసం ద్రావణాన్ని తయారు చేస్తున్న మహిళా రైతులు

కోటవురట్ల: మండలంలోని సుంకపూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ వరలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి మహిళా రైతులు హాజరై ఆసక్తిగా తిలకించారు. నేరుగా వారితో ప్రకృతి వ్యవసాయానికి కావాల్సిన ద్రావణాన్ని తయారు చేయించారు. రసం పీల్చే పురుగు నివారణకు నీమాస్త్రం, గొంగళి పురుగుల నివారణకు బ్రహ్మాస్త్రాలను తయారు చేశారు. వరలక్ష్మి మాట్లాడుతూ ఖరీఫ్ వరిలో మంచి దిగుబడి కోసం ప్రకృతి తరహాలో సాగు చేపట్టాలన్నారు. మనకు అందుబాటులో ఉన్న ఐదు రకాల ఆకులతో ద్రావణాన్ని తయారు చేసుకుని వివిధ దశల్లో పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో మండల యాంకర్ వరహాలమ్మ, మహిళా రైతులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇ-క్రాప్



శిక్షణ కార్యక్రమంలో అధికారులు

రాంబిల్లి: ఇ-క్రాప్ నమోదును పాదర్శకంగా నిర్వహించాలని తహసీల్దార్ పి.భాగ్యవతి అన్నారు. రాంబిల్లి ఆర్‌బీకే వద్ద శుక్రవారం ఇ-క్రాప్ నమోదుపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇ-క్రాప్‌తో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలని పేర్కొన్నారు. ఏవో సి.సుమంత మాట్లాడుతూ పూర్తి స్థాయిలో ఇ-క్రాప్ జరిగితేనే ప్రభుత్వ పరంగా ధాన్యం కొనుగోలు, పంట నష్ట పరిహారం, పంటల బీమా తదితర ప్రయోజనాలు దక్కుతాయన్న విషయాన్ని రైతులకు తెలపాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ నానాజీ

నక్కపల్లి: మండల కేంద్రమైన నక్కపల్లిలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని వైస్ ఎంపీపీ వీసం నానాజీ, ఎంపీడీవో శ్రీనివాసరావులు సూచించారు. శుక్రవారం స్థానిక సచివాలయంలో కార్యదర్శి, సచివాలయం, ఎన్ఆర్ఈజీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందితో సమావేశమయ్యారు. భూగర్భ జలాల పరిరక్షణకు ప్రభుత్వ కార్యాలయాల వద్ద నీరు నిల్వలేకుండా ఇంకుడు గుంతలు తప్పనిసరన్నారు. నక్కపల్లి 50 పడకల ఆస్పత్రి వద్ద కూడా ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఏవో సీతారామరాజు, ఈవోపీఆర్డీ వెంకటనారాయణ, ఏపీవో ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రమ్ సీడర్‌తో వరి నాట్లు

యలమంచిలి: డ్రమ్ సీడర్‌తో విత్తు చేపట్టడం ద్వారా పెట్టుబడి తగ్గి, దిగుబడి పెరుగుతుందని మండల వ్యవసాయాధికారి పి.మోహనరావు అన్నారు. శుక్రవారం యలమంచిలి మండలంలోని మళ్ల కొండబాబుకు చెందిన వరి పొలాల్లో డ్రమ్ సీడర్ ద్వారా నాట్లును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో డ్రమ్ సీడర్‌తో ఎవరైనా రైతులు వరి నాట్లు వేయాలంటే వ్యవసాయ కార్యాలయం ద్వారా యంత్రాన్ని అందిస్తామన్నారు. డ్రమ్ సీడర్‌తో విత్తు నాటడం వల్ల నారుమడి అవసరం లేదన్నారు. ఈ విధానంలో నాట్లు వేసిన తరువాత 2 నుంచి 3 రోజుల్లో సాతి అనే కలుపు మందు వాడితే గడ్డి నివారణ జరుగుతుందన్నారు. వ్యవసాయ సహాయకులు అరుణ, స్వాతి పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంలో సంతోషంగా ప్రజలు

'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే బాబూరావు



పిట్లపాలెంలో మంచంపై ఉన్న వృద్ధుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు



పిట్లపాలెంలో మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

ఎస్.రాయవరం: జగనన్న ప్రభుత్వంలో ప్రతి ఒక్కరు సంతోషంగా జీవించేందుకు అవసరమైన సంక్షేమ పథకాలను అందిస్తున్నారని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. పెదఉప్పలం శివారు పిట్లపాలెం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. వారి మంచిచెడ్డలు తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయో.. లేదో ఆరా తీశారు. కదల్లేని స్థితిలో ఉన్న పలువురు వృద్ధులను పరామర్శించారు. గ్రామంలో దీర్ఘకాలికంగా ఉన్న తాగునీటి సమస్యను తమ ప్రభుత్వం వచ్చాకే పరిష్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. ఎమ్మెల్యేతో గ్రామస్తులు మాట్లాడుతూ శివారు గ్రామాలైన మా వద్దకు నాయకులు ఎన్నికల ప్రచారానికి మాత్రమే వచ్చేవారని, సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాకే తమ సమస్యలు తెలుసుకునేందుకు నాయకులు, అధికారులు తరచూ వస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కోశెట్టి వెంకటరమణ, పార్టీ మండల అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు, స్థానిక నాయకులు శ్రీపతిరాజు, బుచ్చిబాబు, వరహాలరావు, నీలేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల చొరవతోనే సమస్యల పరిష్కారం

ప్రశాంతంగా మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ ఉమాదేవి

కోటవురట్ల: సభ్యులు లేవనెత్తిన సమస్యలను ఆయా శాఖల అధికారులు త్వరితగతిన పరిష్కరించేందుకు చొరవ చూపాలని జెడ్పీటీసీ సభ్యురాలు సిద్దాబత్తుల ఉమాదేవి సూచించారు. ఎంపీపీ శింగంపల్లి అప్పలనాయుడు అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. వైస్ ఎంపీపీ సీతారామరాజు, జెడ్పీటీసీ ఉమాదేవి శాఖల వారీ చేపడుతున్న కార్యక్రమాలు, సాధించిన పురోగతిపై సమీక్షించారు. ముందుగా గత సమావేశంలో సభ్యులు లేవనెత్తిన అంశాలకు సంబంధించి అధికారులు వివరణ ఇచ్చారు. జెడ్పీటీసీ ఉమాదేవి మాట్లాడుతూ సభ్యులు కోరిన సమాచారానికి అధికారులు ఖచ్చితంగా వివరణ ఇవ్వాల్సిందేనన్నారు. ఇటీవల స్థానిక రాజగోపాల ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ మాండేటరీ చెకప్ పేరుతో వినియోగదారుల నుంచి రూ.150 చొప్పున మండలంలోని 25 గ్రామాల నుంచి సుమారు రూ.16 లక్షలు అక్రమంగా వసూళ్లు చేశారని ఆరోపించారు. దీనిపై ఇప్పటి వరకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. వైస్ ఎంపీపీ సీతారామరాజు మాట్లాడుతూ మండలంలో సచివాలయ సిబ్బంది చాలా తక్కువ ఉన్నారని, ఉన్న ఐదుగురికీ ఓట్ల నమోదు బాధ్యత అప్పగించడంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. ఎంపీటీసీ పుత్రేవు వెంకట సూర్యారావు అధికారుల బాధ్యతా రాహిత్యంపై మండిపడ్డారు. మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ వెనుక ఉన్న జగనన్న కాలనీ లే అవుట్‌కు అప్రోచ్ రోడ్డు, ఇంటర్నల్ రోడ్లు వేయలేదన్నారు. లే అవుట్‌కు దారి లేకపోవడంతో ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారని ఆక్షేపించారు. మరో ఎంపీటీసీ పెట్ల రాంబాబు మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకునేవారికి ఉపాధి హామీ పథకం నుంచి నిధులు జమకావడం లేదన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, పారిశుధ్య మెరుగుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సర్పంచులు పైల శివరామ్, చీకట్ల జగదీష్, కోసూరు అప్పారావు కోరారు. రహదారులు, ఉపాధి హామీ పథకం, వంతెనల గురించి పలువురు సభ్యులు వివరణ కోరారు. కార్యక్రమంలో రెండో వైస్ ఎంపీపీ చక్కా సుజాత, ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, తహసీల్దారు జానకమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాగులాపల్లి గ్రామాభివృద్ధికి సహకారం



నాగులాపల్లి ఎంపీటీసీ కాశీసురేష్‌ను సత్కరిస్తున్న స్థానికులు

మునగపాక: నాగులాపల్లి గ్రామాభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందిస్తానని ఎంపీటీసీ సభ్యుడు మళ్ల కాశీ సురేష్ అన్నారు. నాగులాపల్లిలోని పాటిమీద కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి తన కోటా నుంచి రూ.2.50 లక్షలు మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు శుక్రవారం పాటిమీద ప్రజలు కాశీ సురేష్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు గ్రామస్తులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ, నాగులాపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు మళ్ల సుధాకర్‌నాయుడు, బొడ్డేడ బుజ్జి, పెంటకోట జ్యోతి, మోహన్, ఉప సర్పంచ్ దానకృష్ణ, మాజీ ఉప సర్పంచ్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

పాయకరావుపేట: మండలంలోని కేశవరం గ్రామానికి చెందిన వేమగిరి సింహాచలం అనే మహిళ తన భూమిని స్థానిక డెక్కన్ ఫైన్ కెమికల్స్ ఆక్రమించుకున్నారని మండల తహసీల్దార్ కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. సర్వే నెం.108/1బీలోని 5 ఎకరాల డీ పట్టా భూమిని ఆక్రమించుకున్నారని, ఆ భూమిని తనకు అప్పగించాలని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదుదారుతో పాటు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు ధారా సురేష్, దళిత బహుజన ట్రస్ట్ రాష్ట్ర కార్యదర్శి చెంగలరావు తదితరులు ఉన్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన



యలమంచిలిలో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

యలమంచిలి: విద్యుత్ శాఖలో పొరుగు సేవలందిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల్ని రెగ్యులర్ చేయాలని కోరుతూ యలమంచిలి విద్యుత్ సబ్ డివిజన్ ఉద్యోగులు శుక్రవారం కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులు మాట్లాడుతూ వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఎనర్జీ అసిస్టెంట్ల సర్వీసుల్ని క్రమబద్ధీకరించి వేతన సవరణ చేపట్టాలని, అన్ని అలవెన్సులు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో యలమంచిలి డివిజన్ విద్యుత్ ఉద్యోగులు, జేఏసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణంపై గ్రామసభ



గ్రామసభలో రైతుల పేర్లను చదువుతున్న డీటీ శ్రీరామమూర్తి

అనకాపల్లిటౌన్: జీవీఎంసీ విలీన గ్రామమైన కేఎస్‌ఆర్ పేట నుంచి రాజుపాలెం వెళ్లే రహదారిలో రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణానికి భూసేకరణ నిమిత్తం శుక్రవారం 25వ సచివాలయంలో గ్రామసభ నిర్వహించారు. తొలుత డిప్యూటీ తహసీల్దార్ శ్రీరామమూర్తి వంతెన నిర్మాణానికి భూములిచ్చే రైతుల పేర్లను చదివి వినిపించారు. ముందస్తు సమాచారం లేకుండా గ్రామసభ ఏర్పాటు చేసి వంతెన నిర్మాణానికి తమ భూములు కోరడం సరికాదని, తమకు కొంత సమయం కావాలని రైతులు కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కశిరెడ్డి సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ సిరసపల్లి సన్యాసిరావు, రైతులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్ నిధుల జమ

కశింకోట: మండలంలోని రైతులకు పీఎం కిసాన్ యోజన పథకం కింద 14వ విడత రూ.2 వేలు నగదును అర్హుల బ్యాంకు ఖాతాల్లో శుక్రవారం జమ చేశారు. మండలంలో సుమారు 9,600 మందికి ఈ నగదు అందినట్లు మండల వ్యవసాయ అధికారి స్వప్న తెలిపారు. ఖరీఫ్ సాగు పెట్టుబడికి ఈ మొత్తం రైతులకు ఉపయోగపడుతుందని ఆమె పేర్కొన్నారు.

బాలింతలకు బేబీ కిట్స్ వితరణ

అనకాపల్లిటౌన్: జన్మించిన బిడ్డ ఆరోగ్యంగా ఎదగాలంటే వైద్యుల సూచనల మేరకు పౌష్టికాహారం అందించాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు పి.జె.నాయుడు అన్నారు. గవరపాలెం వర్తక సంఘం ప్రసూతి ఆస్పత్రిలో 25 మంది బాలింతలకు క్లబ్ ఆధ్వర్యంలో బేబీ కిట్స్, పాలు, రొట్టెలు, పండ్లు, బూస్ట్ డబ్బాలు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతీ నెల రెండు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి రాపేటి నారాయణరావు, ఆస్పత్రి అధ్యక్షుడు ఆళ్ల ప్రసాద్, కార్యదర్శి కోలపర్తి కన్నబాబు, వైద్యురాలు హరిప్రియ పాల్గొన్నారు.